క్లుప్తంగా

పిట్లంలో ఫ్లాగ్ మార్చ్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో పోలీసులు సోమవారం శశస్త్ర సీమబల్ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కొండ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ సింధు శర్మ ఉత్తర్వుల మేరకు డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శశాస్త్ర సీమాబల్ సిబ్బందితో పిట్లంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మురళి, పిట్లం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్ఎఫ్‌ను గెలిపించాలి



కామారెడ్డి టౌన్: బహుజన రాజ్యం కోసం బీఎల్ఎఫ్‌ను గెలిపించాలని ఆపార్టీ కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి సిరిగాధ సిద్దిరాములు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో రోడ్ షో నిర్వహించి మాట్లాడారు. ఓటును అమ్ముకోవద్దని కోరారు. కామారెడ్డి అభివృద్ధి కోసం, పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవడానికి తనను గెలిపించాలని కోరారు. కత్తెర గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను వేడుకున్నారు. నాయకులు ఆంజనేయులు, సబిత, సాయికృష్ణ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



రామారెడ్డి: మండలంలోని అన్నారం ఎంపీటీసీ గడ్డం చంద్రకళ, భర్త గంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి సోమవారం కాంగ్రెస్ నాయకులు అరికెల నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని భావించి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌కు మెకానిక్‌ల మద్దతు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాలోని మోటార్ బైక్ మెకానిక్ సంఘం తమ పూర్తి మద్దతును బీఆర్ఎస్ పార్టీకి ప్రకటించారు. సోమవారం కామారెడ్డిపెద్ద చెరువు వద్ద సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్‌ల ఆధ్వర్యంలో 250 మంది మెకానిక్‌లు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపారు.

కుర్మ సంఘం అభివృద్ధికి కృషి



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి కుర్మ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు అన్నారు. సోమవారం ఆయన దేవునిపల్లిలోని కుర్మ సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ గెలిస్తే కామారెడ్డిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కుర్మ కుల దేవుడైన బీరప్ప ఆలయానికి రెండు ఎకరాల భూమి, పెద్దపురం మల్లయ్య ఆలయానికి ప్రహారీ నిర్మాణం, సంఘ భవనానికి 5 లక్షల నిధులు ఇప్పించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ఈ పనులన్ని చేస్తానని హామీ ఇచ్చారు. కుర్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన బేస్త సాయిలుకు సెల్‌ఫోన్‌ను అప్పగించినట్లు ఎస్సై గణేష్ సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన సాయిలు కొద్ది రోజుల క్రితం ఎల్లారెడ్డిలో సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు ఫోన్ ఆచూకీని కనిపెట్టి సోమవారం బాధితుడికి అందించారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం



బాన్సువాడ : ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాన్సువాడకు వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు మహిళలు బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభకు వచ్చిన నడ్డాకు మహిళలు ఘనస్వాగతం పలికారు. పాత అంగడి బజారు నుంచి మహిళలు, కార్యకర్తలు, ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. సభకు పెద్ద ఎత్తున జనాలు రావడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

మదన్‌మోహన్ అమ్ముడుపోవడం పక్కా

- ఆయన గెలిస్తే 6 నెలలు అమెరికాలో.. 6 నెలలు ఎల్లారెడ్డిలో ఉంటారు
- ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి



లింగంపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

లింగంపేట(ఎల్లారెడ్డి): మదన్‌మోహన్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిస్తే బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోవడం పక్కా అని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన లింగంపేట మండలం బాణాపూర్‌తండా, బాణాపూర్, కొర్పోల్, బాయంపల్లి, నాగారం, లింగంపల్లి, ముస్తాపూర్, ఎల్లారం, బూరుగిద్ద, గాంధీనగర్, మోతె తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో మాట్లాడారు. మదన్‌మోహన్‌రావు గెలిచినా ఆయన అమెరికాలో ఆరు నెలలు ఎల్లారెడ్డిలో అరు నెలలు ఉంటారన్నారు. ప్రజలకు మేలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడ్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ గెలిస్తే రైతులు పండించే ధాన్యానికి మద్దతు ధర రూ.3100 చెల్లిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు అన్యాయం చేసిందన్నారు. సంవత్సరాలుగా నా సేవలను వాడుకొని పారాచూట్ నేతకు డబ్బులకు టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎల్లారెడ్డిలో బీజేపీ గెలుపు ఖాయం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ కచ్చితంగా విజయం సాధిస్తుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రం అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. ఈనెల 28న అన్ని గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. అనంతరం చందాపూర్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. నాయకులు వెంకట్‌రావు, రాంరెడ్డి గంగారెడ్డి, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



చందాపూర్‌లో ప్రచారం చేస్తున్న లక్ష్మారెడ్డి

ప్రచారానికి రాని కేసీఆర్ కామారెడ్డికి ఏం చేస్తారు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్



దేవునిపల్లిలో ప్రచారం చేస్తున్న ఇందు ప్రియ

- మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో ప్రచారానికి సమయం ఇవ్వకుండా ముఖం చాటేసిన కేసీఆర్ కామారెడ్డికి ప్రజలకు ఎలా అందుబాటులో ఉంటాడని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నామినేషన్ వేసిన నాటి నుంచి ఇప్పటివరకు కామారెడ్డి ముఖం చూడలేదన్నారు. కేసీఆర్ గెలిస్తే బుల్లెట్ లేని తుపాకీగా మారుతారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కై రైతుబంధుకు అనుమతి తెచ్చుకున్నారని, కానీ హరీష్ రావు వ్యాఖ్యలతో ఈసీ ఆపేసిందన్నారు. కామారెడ్డిలో రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు రవి, పంపరి లక్ష్మణ్ తదితరులున్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందు ప్రియ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి, లింగాపూర్, కల్కినగర్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఓటర్లకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు.

బీజేపీకి రాజీనామా

రాజంపేట: రాజంపేట మండలం ఎల్లారెడ్డి నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేసిన ఆర్గొండ గ్రామానికి చెందిన నిమ్మల సుధాకర్ రెడ్డి సోమవారం బీజేపీకి రాజీనామా చేసినట్లు సోమవారం తెలిపారు. పార్టీలో సరైన ప్రాధాన్యత కల్పించడం లేదని, దీంతో మనస్తాపానికి గురై రాజీనామా చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సింధే చేసిన అభివృద్ధి శూన్యం

- జుక్కల్ కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీకాంతరావు

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గం అన్ని రంగాలలో వెనకబాటుకు గురైందని, పదిహేను సంవత్సరాలుగా హన్మంత్ సింధే ఎమ్మెల్యేగా ఉన్నా చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంతరావు ఆరోపించారు. సోమవారం తక్కడ్‌పల్లి, ఫత్లాపూర్, రాచూర్, కందర్‌పల్లిలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వండి.. ఆరు నెలల్లో రోడ్ల పనులు ప్రారంభించి గ్రామాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఒక్క డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని, అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని, ఓటర్లు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి, శెట్కార్ రాజు, నౌషా నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఫత్లాపూర్‌లో మాట్లాడుతున్న లక్ష్మీకాంతరావు

పీసీసీ చీఫ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి



కండువాలు కప్పుతున్న వేణుగోపాల్ రెడ్డి, కొండల్ రెడ్డి

దోమకొండ: కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిమ్మయ్యగారి వేణుగోపాల్ రెడ్డి, రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కోరారు. సోమవారం దోమకొండ మండలం అంబారీపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి అభివృద్ధి కోసం రూ.1000 కోట్లతో ప్రత్యేక ప్రణాళికను తయారు చేస్తామని, సీఎం కేసీఆర్‌ను ఓడించాలని ఓటర్ల కోరారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 6 గ్యారంటీలపై ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులను కోరారు. నాయకులు ముత్యం రెడ్డి, తిరుమల గౌడ్, ఫిరంగి రాజేశ్వర్, అనంతరెడ్డి, స్వామి సీతారాం, మధు తదితరులున్నారు.

కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే మోసపోతాం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

దోమకొండ/కామారెడ్డి రూరల్: కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే మోసపోతామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం దోమకొండ మండల కేంద్రంలో ఆయన రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక కష్టాలు పడ్డామన్నారు. తిరిగి మళ్లీ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో వస్తుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా లేని విధంగా ఇక్కడ పథకాలు ఉన్నాయన్నారు. అక్కడ ప్రజలకు ఇవ్వలేని పథకాలు ఇక్కడ ఇస్తామని అబద్ధపు ప్రచారాలతో వస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కామారెడ్డి మండలం ఇస్రోజీవాడికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు గంద్ర మధుసూదన్ రావ్, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ అంజలి, తదితరులున్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

'గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా'

- తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి



బీబీపేట: తెలంగాణలో ప్రతి గ్రామాన్ని ప్రభుత్వం అనేక రకాలుగా అభివృద్ధి చేసిందని, ప్రస్తుతం కామారెడ్డిని రాష్ట్రంలో నంబర్ వన్‌గా చేయడమే లక్ష్యంగా కేసీఆర్ పోటీ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి అన్నారు. సోమవారం మాందాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మాందాపూర్‌లో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేశామని, మిగిలిన పనులను కూడా పూర్తిగా చేస్తామని అన్నారు. గ్రామంలో ప్రతి కాలనీలో సీసీ రోడ్లు వేసే బాధ్యత తనదని పేర్కొన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలనిఅన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకుందాం

- పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



దోమకొండ: సీఎం కేసీఆర్‌ను గెలిపించి తమ సమస్యలను ఉద్యోగులు పరిష్కరించుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎంగా కేసీఆర్ గెలిచిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని వివరించారు. ఉద్యోగుల పీఆర్‌సి, పీఎఫ్ ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి కేసీఆర్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు బాసటగా నిలవండి

- వికలాంగుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

భిక్కనూరు: పదేళ్లుగా తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టిన సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని వికలాంగుల సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండలం బస్వాపూర్, పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, జంగంపల్లి గ్రామాల్లో దివ్యాంగులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సమితి ప్రతినిధులు బాల్‌రెడ్డి, భూపతి, నాగరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే దళితుల సంక్షేమం

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కేసీఆర్, బీఆర్ఎస్‌తోనే దళితులకు సంక్షేమం జరుగుతుందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు వేముల బలరాం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లు దళిత వ్యతిరేక పార్టీలని ఆరోపించారు. 30 ఏళ్ల నుంచి ఎస్సీ వర్గీకరణపై మోసం చేస్తున్నాయని అన్నారు. ఆ పార్టీల మోసపూరిత మాటలను నమ్మవద్దని కోరారు. సమావేశంలో నాయకులు గోపి, వెంకటేష్, కనకరాజు, భూమన్న తదితరులున్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ మోసం చేసింది



శెట్పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్



జాజాలను గజమాలతో సన్మానిస్తున్న మైనార్టీలు



ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్

- ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఆయన లింగంపేట మండలం అయ్యపల్లి ప్రభుస్వామి ఆలయంలో పూజలు చేసి అక్కడి నుంచి ప్రచారం ప్రారంభించారు. అయ్యపల్లి, శెట్పల్లి, పర్మళ్ల, ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి, శెట్పల్లిసంగారెడ్డి, మాలపాటి, రాంపూర్, జల్దిపల్లి, భవానిపేట, ముంబోజిపేట, కంచుమల్, కొండాపూర్ తదితర గ్రామాల్లో తండాల్లో రోడ్ షోలు నిర్వహించి ప్రధాన కూడళ్లలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అక్కడి ప్రజలకు మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మోసపోతామన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మితే గోసపడాల్సివస్తుందన్నారు. స్థానికంగా ఉండే నాయకులకే ప్రజలు పట్టం కట్టాలన్నారు.

మైనార్టీలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని మైనార్టీలకు గృహలక్ష్మీ పథకం కింద పక్కా ఇంటి నిర్మాణం చేపడతామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో నిర్మించిన 300 డబుల్ బెడ్ రూంలలో 140 మైనార్టీలకు కేటాయించినట్లు తెలిపారు. తనను మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించగానే మిగిలిన వారికి కూడా ఇళ్లు కేటాయిస్తానన్నారు. అనంతరం మైనార్టీలు ఎమ్మెల్యేను సత్కరించారు.

జాజాల గెలవాలని పాదయాత్ర

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెల్లుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొగ్గుల సాయిలు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యేగా జాజాల సురేందర్ గెలుపొందాలని కోరుతూ సొంతూరు నుంచి బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుపతి దేవస్థానం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'సంక్షేమ పథకాలను చూసి గెలిపించండి'

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మరోమారు కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి సురేందర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్ కోరారు. మండలంలోని పల్లెబోగుడతండాలో సోమవారం ఆయన జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు.

ఇంటింటి ప్రచారం



కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని 8,9వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి సీఎం కేసీఆర్ తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని ప్రతి వార్డులో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా జాజాల సురేందర్‌ను గెలిపించాలని మున్సిపల్ కౌన్సిలర్లు ఓటర్లను కోరారు. కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ నేత నల్లవెల్లి అశోక్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల బూత్ కమిటీ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్‌లో..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు బీఆర్ఎస్ మేనిఫెస్టోను వివరించారు. నాయకులు ఖలీల్, మోసిన్, ఫయాజ్, హైదర్, ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

'దొరల పాలనకు చరమగీతం పాడాలి'

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దొరల పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు రెడ్డి అన్నారు. సోమవారం నెమ్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేశారు. గ్రామానికి చెందిన సుమారు 40 మంది యువకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నేతలు శివ ప్రసాద్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి

జిల్లాలో సోమవారం మహిళలు కార్తీక పౌర్ణమిని భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాలన్ని దర్శించుకున్నారు. దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల వద్ద ఈ సందర్భంగా అన్నదానాలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



త్రిలింగేశ్వరాలయంలో ..



శారదామాత ఆలయంలో పాల్గొన్న భక్తులు



సలాబత్‌పూర్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సింధే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



పిట్లం(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో మండలంలోని పలువురు ఇతర పార్టీ నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే సింధే, బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో పిట్లం జీపీ 11వ వార్డు సభ్యురాలి భర్త బాసిత్ కూడా ఉన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, నాయకులు బాబుదొర, ప్రతాప్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

హన్మంత్ సింధే గెలవాలని పూజలు

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ రామలింగేశ్వర ఆలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు పాండు పటేల్ శివస్వాములతో కలిసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హన్మంత్ సింధే గెలవాలని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.